

నిత్యాన్నదానానికి విరాళం

విజయవాడ : దుర్గా మల్లేశ్వరస్వామి గుడిలో నిత్యాన్నదానానికి గుంటూరుకు చెందిన మెట్టు బలరామిరెడ్డి, వెంకమ్మలు రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు.



పానకం హక్కులకు వేలం

మంగళగిరి : లక్ష్మీనృసింహస్వామి గుడిలో పానకం విక్రయ హక్కులకు బుధవారం వేలం జరిగింది. రూ.1,11,69,999.90 లకు పాటదారు దక్కించుకున్నారు.

నేటితో ముగియనున్న పింఛన్ల పంపిణీ



నెహ్రూనగర్: వైఎస్సార్ పెన్షన్ కానుకను గుంటూరు జిల్లాలో బుధవారం లబ్ధిదారుల ఇళ్లకు వలంటీర్లు వెళ్లి అందజేశారు. నాలుగో రోజు జిల్లాలో 97.85 శాతం పంపిణీ పూర్తయింది. నేటితో పింఛన్ల పంపిణీ ముగియనుంది.

న్యూస్‌రీల్

ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణకు దరఖాస్తులు


పాత గుంటూరు : గుంటూరు–2 డిపోలో హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ స్కూల్‌లో డ్రైవర్లకు త్వరలో శిక్షణ ప్రారంభించనున్నట్లు డిపో మేనేజరు షేక్ అబ్దుల్ సలామ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ డ్రైవింగ్ స్కూల్‌లో ఇప్పటి వరకు 12 బ్యాచ్‌లు శిక్షణ పూర్తి చేసుకున్నాయని, 13వ బ్యాచ్‌కు 16 మంది నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. గుంటూరు పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్ కలిగిన (కారు, జీప్) డ్రైవర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. వివరాల కోసం 8897371003, 7382894585 ఫోన్ నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

యార్డుకు 40,677 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 40,677 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 38,822 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,800 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి 26,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.9,000 నుంచి రూ.22,500 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,000 నుంచి 26,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 13,298 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 525.10 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 27,930, ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 856.20 అడుగుల వద్ద ఉంది.

రాష్ట్రంలో కులగణన నివేదిక వెలువడేలా చూడాలి

ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు వినతి

తెనాలి: రాష్ట్రంలో కులగణనకు నియమించిన కమిటీ తన నివేదికను త్వరలో సమర్పించేలా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చొరవ తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన తెనాలిలో విలేకరులతో మాట్లాడుతూ జనాభా లెక్కలు లేని కారణంగా దేశంలో బీసీ కులాలకు రాజకీయ ప్రాధాన్యం లేకుండా పోతోందని గుర్తుచేశారు. 2021లో చేపట్టే జనాభా లెక్కల్లో కులగణన చేస్తామని ప్రకటించిన బీజేపీ ఇంత వరకు ఆచరణలోకి తేలేదని చెప్పారు. రాష్ట్రంలో బీసీ కులగణన బాధ్యతను బీసీ మంత్రి సీహెచ్ వేణుగోపాలకృష్ణకు గత ఏప్రిల్‌లో అప్పగించినట్టు తెలిపారు.

10 మండలాల్లో వర్షం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలోని పది మండలాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు అత్యధికంగా తుళ్ళూరు మండలంలో 22 మిల్లీ మీటర్ల వర్షం పడగా, అత్యల్పంగా గుంటూరు పశ్చిమలో 1 మి.మీ వర్షం పడింది. సగటున 5.2 మి.మీ వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. వట్టిచెరుకూరు 19.8, ఫిరంగిపురం 13.2, మంగళగిరి 10.4, తాడేపల్లి 8.6, చేబ్రోలు 7.2, కాకుమాను 5.6, పెదనందిపాడు 4.2, పొన్నూరు మండలంలో 1.2 మి.మీ చొప్పున వర్షం పడింది.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 3,225 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 156, బ్యాంక్ కెనాల్‌కు 1,076, తూర్పు కెనాల్‌కు 60, పశ్చిమ కెనాల్‌కు 73, నిజాంపట్నం కాలువకు 117, కొమ్మమూరు కాల్వకు 1,575 క్యూసెక్కులు వదిలారు.

ఆరోగ్య సౌభాగ్యం

దిగ్విజయంగా వైద్యయజ్ఞం

- జిల్లాలో ఇంటింటికీ వైద్యసేవలు
- ఇప్పటి వరకూ 8,53,310 మంది ఆరోగ్య వివరాల సర్వే
- జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు విశేష స్పందన
- 127 రకాల ఔషధాలు ఉచితంగా పంపిణీ



దివ్యఔషధం : చౌడవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మందులు తీసుకుంటున్న రోగులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ప్రతి ఇంటి తలుపు తట్టి అందరికీ ఆరోగ్య సేవలు అందించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పంతో ప్రారంభమైన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి గుంటూరు జిల్లాలో విశేష స్పందన లభిస్తోంది. ఇప్పటి వరకూ జిల్లాలో ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు ఇతర ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి 8,53,310 మందిని సర్వే చేశారు. వారికి 10,48,667 రక్త పరీక్షలు నిర్వహించారు. గత రెండు రోజుల్లో గ్రామీణ ప్రాంతాలలో 27, పట్టణ ప్రాంతాలలో ఐదు కలిపి మొత్తం 32 శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాలలో 14,355 మందిని పరీక్షించగా అందులో 880 మందిని వివిధ ఆరోగ్య శ్రీ ఆస్పత్రులకు మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేశారు. మరో 8,850 మందికి ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. బుధవారం గ్రామీణ ప్రాంతాలలో 10, అర్బన్‌లో మూడు శిబిరాలు ఏర్పాటు చేశారు. వీటి వివరాలు ఇంకా క్రోడీకరించాల్సి ఉంది. గ్రామీణ ప్రాంతాలలో సగటున 405 మంది, అర్బన్‌లో సగటున 683 మంది ఇప్పటి వరకూ శిబిరాలకు హాజరయ్యారు. ఈ శిబిరాలలో 127 రకాల మందులను అందుబాటులో ఉంచుతున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి నెల రోజులకు సరిపడా ఔషధాలు ఇస్తున్నారు.

ఒక్కో పీహెచ్‌సీ పరిధిలో నాలుగు శిబిరాలు!

అందరికీ నాణ్యమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ యంత్రాంగం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఒక యజ్ఞంలా నిర్వహిస్తోంది. అర్బన్ పరిధిలో ఒక్కో యూపీహెచ్‌సీ పరిధిలో ఒక్కో శిబిరం నిర్వహించాలని తొలుత నిర్ణయించారు. అయితే ఈ కార్యక్రమానికి వస్తున్న స్పందన చూసిన తర్వాత ఒక్కో పీహెచ్‌సీ పరిధిలో మూడు నుంచి నాలుగు శిబిరాలు పెట్టాలని నిర్ణయించారు. ఈ ఆరోగ్య శిబిరాల్లో కంటి వైద్యం కోసం వస్తున్న వారి సంఖ్య కూడా గణనీయంగా ఉండటంతో ప్రతి వైద్య శిబిరంలోనూ నేత్ర వైద్యుడి సేవలను తప్పనిసరి చేశారు. వైద్య సేవల్లో ఎటువంటి లోటూ రాకుండా ఉండేందుకు ప్రతి శిబిరాన్ని వైద్య సిబ్బందితో పాటు మండల అధికారులు, ఒక స్పెషల్ ఆఫీసర్ పర్యవేక్షించేలా ఏర్పాటు చేశారు.

విభాగం	వైద్యుల సంఖ్య	ఓపీ	సగటు ఓపీ
వైద్యాధికారులు	66	7,124	108
గైనకాలజిస్టులు	21	1,153	55
జనరల్ మెడిసిన్	22	2,545	116
పీడియాట్రిక్స్	13	702	54
ఆర్థోపెడిక్స్	4	384	96
జనరల్ సర్జరీ	2	241	121
నెఫ్రాలజీ	2	249	125
నేత్ర వైద్యులు	27	3,819	141

శిబిరాల నిర్వహణకు నిధులు

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల నిర్వహణ కోసం గ్రామీణ ప్రాంతాలలో ఒక్కో శిబిరానికి రూ. 30 వేలు, అర్బన్ ప్రాంతాలలో రూ. 60 వేలు ప్రభుత్వం మంజూరు చేసింది. ఇంకా అవసరమైతే కలెక్టర్లు ఖర్చు చేసేందుకు అధికారాలు ఇచ్చింది.

ప్రతి శిబిరంలో పది డెస్క్‌లు

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో పది డెస్క్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఒకటి హెల్ప్, రెండోది రిజిస్ట్రేషన్ కాగా, ఎంబీబీఎస్ వైద్యులు, స్పెషలిస్టులు, నేత్ర వైద్యులు, పరీక్షలు, మందులు, సర్వేలో పాల్గొనని వారికి బీపీ, షుగర్ చెక్ చేసేందుకు వేర్వేరు డెస్క్‌లను ఏర్పాటు చేశారు. ప్రజా స్పందనను బట్టి మహిళలకు, పురుషులకు వేర్వేరుగా డెస్క్‌లు ఏర్పాటు చేస్తున్నారు.



సుఖీభవ : చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యురాలు



వైద్య అభయం : నమోదు పత్రం తీసుకుంటున్న అవ్వ



నేత్రపర్వం : కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు



చల్ల'గుండె'లా : ఈసీజీ తీస్తున్న నర్సింగ్ విద్యార్థులు

సంతృప్తికరంగా సేవలు



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యసేవలు జిల్లాలో సంతృప్తికరంగా సాగుతున్నాయి. రోజూ కనీసం రెండు వైద్య శిబిరాలను పరిశీలించి రోగులకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకుంటున్నాను. అన్ని రకాల వైద్య సేవలు, మందులు ఒకేచోట లభించడంపై ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఎక్కడా ఎటువంటి ఇబ్బందులూ లేకుండా వారికి అన్ని ఏర్పాట్లూ చేస్తున్నాం.

– ఎం.వేణుగోపాల్‌రెడ్డి, కలెక్టర్, గుంటూరు

జగన్ బాబు మేలు మరువం



కొన్నేళ్లుగా బీపీ, షుగర్, చెవి వ్యాధితో బాధపడుతున్నా. గుండె దడ కూడా ఉంది. వైద్య శిబిరానికి వస్తే పరీక్షలు చేసి భయం లేదని చెప్పారు. మందులు ఇచ్చారు. సంతోషంగా ఉంది. పైసా ఖర్చు లేకుండా వైద్యం అందిస్తున్న జగన్‌బాబు మేలు మరువం.

– షేక్, మౌలాబీ. ఫిరంగిపురం

పేదలకు వరం



నేను కొంత కాలంగా బీపీ, ఆస్తమా, కీళ్లనొప్పులతో ఇబ్బంది పడుతున్నా. జగనన్న సురక్ష వైద్యశిబిరంలో ఉచితంగా పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు ఇచ్చారు. మాలాంటి పేదలకు ఈ శిబిరం వరం. పెద్ద ఆస్పత్రులకు వెళ్లి వైద్యం చేయించుకునే స్తోమత లేని మాబోటివాళ్ల కోసం జగన్‌బాబు ఎంతో చేస్తున్నారు. ఆయన పది కాలాలపాటు చల్లగా ఉండాలి.

– షేక్ ఖైరూన్‌బీ, ఫిరంగిపురం

ఎంతో ప్రయోజనం



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు పేదలకు ఎంతో ప్రయోజనం. పరీక్షలన్నీ ఉచితంగా చేసి మందులూ ఇస్తున్నారు. కొన్నేళ్లుగా బీపీ, మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నా. ఈ శిబిరాలతో ఎంతో ప్రయోజనం కలుగుతోంది.

– వంగా శివమ్మ, వల్లభాపురం, కొల్లిపర మండలం

పరిశ్రమలకు పచ్చతివాచీ



కార్యక్రమంలో పాల్గొన్న ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, పోతుల సునీత, హెనీ క్రిస్టినా, కలెక్టర్ రంజిత్‌బాషా

శాసనమండలి చీఫ్‌విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి

బాపట్ల: పరిశ్రమలను ప్రోత్సహించేందుకు పచ్చతివాచీ పరిచి స్వాగతం పలుకుతున్నట్టు ఆంధ్రప్రదేశ్ శాసన మండలి చీఫ్‌విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గంలోని బొడ్డువానిపాలెం గ్రామంలో శర్వాణి బయో ఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ శంకుస్థాపన శిలాఫలకాన్ని వర్చువల్ విధానంలో తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల కలెక్టరేట్ నుంచి కలెక్టర్ పి.రంజిత్ బాషా, శాసన మండలి చీఫ్ విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ పోతుల సునీత, గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా పాల్గొన్నారు. ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బాపట్ల జిల్లా అద్దంకిలోని బొడ్డువానిపాలెంలో స్థాపిస్తున్న శర్వాణి బయోఫ్యూయల్ పరిశ్రమ జిల్లాకు తలమానికం కానుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పర్యావరణహిత పరిశ్రమగా రూ.220 కోట్లతో నిర్మితమవుతున్న ఈ సంస్థ వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. 200 మందికి పరోక్షంగా మరో 100 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించే అవకాశం ఉందని చెప్పారు. నూకలు, తడిసిన, విరిగిన ధాన్యం, మొక్కజొన్న ముడిపదార్థాలుగా ఈ పరిశ్రమ నడుస్తుందని, దీని వల్ల రైతులకు మంచి జరుగుతుందని వివరించారు. ఈ పరిశ్రమ రోజుకు 200 కిలో లీటర్ల ఇథనాల్ ఉత్పత్తి చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో శర్వాణి బయోఫ్యూయల్స్ ప్రతినిధులు, కొపనాతి సాయి వెంకట్ కుమార్, శంకర్ రెడ్డి, బాపట్ల జిల్లా పరిశ్రమల అధికారి ఎస్.మదన్మోహన శెట్టి, సహాయ సంచాలకులు సి.సూరిబాబు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ గోపికృష్ణ, డీటీసీపీఓ గురవారెడ్డి, డీహెచ్ఓపీ జనమ్మ, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ వి.వి.రామకృష్ణ, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బీవీ రత్నగుప్త, యువ పారిశ్రామికవేత్తలు పిన్నిబోయిన శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా తయారీ

జిల్లాలో ఓటర్ల జాబితా తయారీ పారదర్శకంగా చేస్తున్నట్టు కలెక్టర్ పి.రంజిత్ బాషా చెప్పారు. బుధవారం ఓటర్ల జాబితా సవరణపై కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు.

ఆపరేషన్ లేకుండా వంకర కాళ్లు సరి

జీజీహెచ్ వైద్యుల ఘనత



వంకరకాళ్లు సరిచేయించుకున్న చిన్నారులతో డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తదితరులు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో ఆర్థోపెడిక్ మూడో యూనిట్ వైద్యులు ఆపరేషన్ లేకుండా పిల్లల వంకర కాళ్లను సరి చేశారు. దీంతో ఆర్థోపెడిక్ మూడో యూనిట్ ఇన్‌చార్జి విభాగాధిపతి డాక్టర్ అద్దేపల్లి శ్రీనివాస్‌ను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ బుధవారం అభినందించారు.

ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పుట్టగానే కాలు వంకర్లు పోయిన చిన్నారులకు ఆపరేషన్ లేకుండా వైద్యం చేసి సరి చేశారని చెప్పారు. ప్రతి బుధవారం ఓపీకి వచ్చిన వారికి ఎలాంటి కోత, కుట్లు లేకుండా వంకర కాళ్లను సరి చేస్తారని వివరించారు. క్యూర్ ఇండియా స్వచ్ఛంద సంస్థ గ్రామాల్లో కాళ్ల వంకరగా ఉన్న పిల్లలను గుర్తించి వారిని గుంటూరు ప్రభుత్వాస్పత్రి ఆర్థో విభాగానికి తీసుకుని వస్తున్నట్టు వెల్లడించారు. డాక్టర్ అద్దేపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ పుట్టగానే చిన్నారులకు కాళ్ళు వంకరగా ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే ఆస్పత్రికి తీసుకురావాలని చెప్పారు.

ప్రసూతి వార్డులో సెక్యూరిటీ బలోపేతం

గుంటూరు జీజీహెచ్ ప్రసూతి వార్డులో సెక్యూరిటీని బలోపేతం చేస్తున్నట్లు గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. పసికందు అపహరణకు గురైన నేపథ్యంలో ఆయన సెక్యూరిటీ వ్యవస్థను బుధవారం పరిశీలించారు. ప్రసూతి వార్డులో రోగులను బయటకు, లోపలకు వెళ్లేందుకు ఒక ద్వారాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఇతరులను లోపలకు అనుమతించబోమని పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలకు సంబంధించిన సహాయకులకు గుర్తింపు కార్డు ఇస్తామన్నారు. సదరు కార్డు ఉన్న వారిని మాత్రమే వార్డు లోపలకు అనుమతిస్తామని వెల్లడించారు. ప్రసూతి వార్డులో స్టాఫ్ నర్సును నియమించి, బయటకు బిడ్డను తీసుకుని వెళ్లేవారి పేరును రిజిస్టర్‌లో నమోదు చేస్తామని తెలిపారు. ఈప్రక్రియను ఒక వైద్యుడు పర్యవేక్షణ చేస్తారన్నారు. కొత్త పేట పోలీసుల సహకారంతో బందోబస్తు బలోపేతం చేస్తామని వివరించారు.

మెరి'సాయి దివ్య' ప్రయోగాలు

- బుల్లి ఉపగ్రహాల రూపశిల్పి
- స్ట్రాటో ఆవరణలోకి మరో శాటిలైట్
- స్పెయిన్‌లో బీ2 స్పేస్ కంపెనీతో కలిసి బీడబ్ల్యూశాట్ పేలోడ్ ప్రయోగం
- గతేడాది తొలి ప్రైవేట్ రాకెట్ ప్రయోగంలోనూ భాగస్వామ్యం



తన బృందంతో కలిసి బీడబ్ల్యూశాట్‌ను చూపుతున్న సాయిదివ్య

తెనాలి: తెనాలికి చెందిన బుల్లి ఉపగ్రహాల రూపశిల్పి కొత్తమాసు సాయిదివ్య మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. తాను రూపొందించిన క్యూబ్‌శాట్–బీడబ్ల్యూశాట్‌ను స్పెయిన్ దేశంలో అక్కడి బీ2 స్పేస్ కంపెనీ సాయంతో బుధవారం స్ట్రాటో ఆవరణలోకి ప్రయోగించారు. ఉపగ్రహ కమ్యూనికేషన్ రంగంలో పీహెచ్‌డీ స్కాలర్ అయిన సాయి దివ్య ప్రయోగించిన పేలోడ్లలో ఇది మూడోది కావటం విశేషం. 280 గ్రాముల ఈ పేలోడ్‌ను ఇక్కడి తన సొంత 'ఎన్–స్పేస్‌టెక్' అనే సంస్థలో తన బృందంతో కలిసి ఆమె తయారుచేశారు.

ఇదీ నేపథ్యం

శాటిలైట్ కమ్యూనికేషన్ రంగంలో రీసెర్చ్ స్కాలర్‌గా పనిచేస్తున్న కొత్తమాసు సాయిదివ్య బాపట్ల ఇంజినీరింగ్ కాలేజిలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ చేశారు. కేఎల్ యూనివర్సిటీలో కమ్యూనికేషన్ అండ్ రాడార్ సిస్టమ్స్‌లో ఎంటెక్ చేశారు. తన థీసిస్‌లో భాగంగా తన నివాసంలోనే 'ఎన్–స్పేస్‌టెక్' అనే సొంత కంపెనీని ఆరంభించారు. అంతరిక్ష సాంకేతికతను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావటం, తక్కువ ఖర్చుతో బుల్లి ఉపగ్రహాల తయారీని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. తొలిగా లక్ష్యశాట్ పేరుతో క్యూబ్‌శాట్‌ను తయారుచేసి, గతేడాది మార్చిలో యునైటెడ్ కింగ్‌డమ్ నుంచి బీ2 స్పేస్ సహకారంతోనే స్ట్రాటో ఆవరణలోకి విజయవంతంగా ప్రయోగించారు. ఎక్కువ ఎత్తుకు వెళ్లగలిగిన బెలూన్ సాయంతో పంపిన 400 గ్రాముల లక్ష్యశాట్, భూతలం నుంచి 26 కిలోమీటర్ల ఎత్తుకు వెళ్లి, స్ట్రాటో ఆవరణలో కొన్ని గంటల ఉండగలిగింది.

ప్రైవేట్ ర్యాకెట్ ప్రయోగంలో భాగస్వామి


తర్వాత కొద్దినెలల్లోనే దేశంలో జరిగిన తొలి ప్రైవేట్ రాకెట్ ప్రయోగంలో సాయిదివ్య భాగస్వామి కాగలిగారు. స్కై రూట్ అనే ప్రైవేటు సంస్థ విక్రమ్–ఎస్ రాకెట్‌ను శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి సబ్ ఆర్బిట్‌లోకి ప్రయోగించారు. ఆ రాకెట్ తీసుకెళ్లిన మూడు పేలోడ్లలో తెనాలిలో సాయిదివ్య రూపొందించిన లక్ష్యశాట్–2 పేలోడ్ ఒకటి కావటం గమనించాల్సిన అంశం.

స్ట్రాటో ఆవరణలో అధ్యయనానికి బీడబ్ల్యూశాట్


ఆ క్రమంలోనే సాయిదివ్య తమిళనాడుకు చెందిన శక్తిప్రియ, బాపట్ల, కాకినాడలకు చెందిన రెహమాన్, ఉత్తేజ్‌తో కలిసి బీడబ్ల్యూశాట్‌ను తయారుచేశారు. మయన్మార్ దేశంలోని ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులకు శాటిలైట్ టెక్నాలజీపై వీరు ఇక్కణ్నుంచే ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నారు. ఆ బోధనలో భాగంగానే తయారుచేసిన బీడబ్ల్యూశాట్‌ను మయన్మార్ తీసుకెళ్లి అక్కడి విద్యార్థులకు ప్రదర్శించారు. డిమాన్‌స్ట్రేషన్ ఇచ్చారు. అనంతరం బీ2 స్పేస్ కంపెనీ సహకారంతో స్పెయిన్‌లో ప్రయోగించారు. తాజా పేలోడ్‌తో స్ట్రాటో ఆవరణంలోని ఉష్ణోగ్రత, తేమ, ఆల్టిట్యూడ్ ప్రెషర్, యూవీ ఇంటెన్సిటీ, ఎంత వెలుతురు ఉంది అనే డేటా సేకరణ వీలవుతుందని బుధవారం సాయంత్రం సాయిదివ్య స్థానిక విలేకరులకు తెలిపారు. స్కైరూట్ సంస్థతో కలిసి త్వరలో జరగనున్న విక్రమ్–1 రాకెట్ ప్రయోగంలో భాగస్వామ్యం కానున్నట్టు చెప్పారు. రాకెట్‌లో ప్రయోగించే ఐయూ క్యూబ్‌శాట్ పేలోడ్ రూపకల్పనలో ఉన్నట్టు వివరించారు. తన తొలి పేలోడ్ నుంచి ఇప్పటివరకు తన భర్త రఘురామ్, అత్తమామలు కొత్తమాసు కుమార్, చంపకవల్లి, తండ్రి కేవన్ ప్రసాద్ సహకారం మరువలేనిదని పేర్కొన్నారు.

అనుమానం పెనుభూతమై

- భార్యను హతమార్చి ఉరివేసుకున్న భర్త
- అనాథలుగా మారిన పిల్లలు



అర్చన (ఫైల్)



ఆత్మహత్య చేసుకున్న పాల్

మంగళగిరి: అనుమానం పెనుభూతమైంది. పచ్చని సంసారంలో చిచ్చురేపింది. భార్య హత్యకు పురిగొల్పింది. ఆనక బలవన్మరణానికి దారితీసింది. పిల్లలను అనాథలను చేసింది. నిండు కుటుంబాన్ని విషాదంలోకి నెట్టింది. ఈ హృదయ విదారక ఘటన నగరంలోని పార్కు రోడ్డులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. చీరాలకు చెందిన కె.పాల్(35), అర్చన(32) భార్యాభర్తలు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. పాల్ మంగళగిరిలో కార్పెంటర్‌గా, అర్చన ఎన్ఆర్ఐ ఆస్పత్రిలోని క్యాంటిన్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల అర్చనపై అనుమానం పెంచుకున్న పాల్ ఆమెను వేధిస్తున్నాడు. తరచూ ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం భార్యాభర్తలు గొడవ పడ్డారు. క్షణికావేశంలో అర్చనను పాల్ గట్టిగా కొట్టడంతో తీవ్రంగా గాయపడి ఆమె మరణించింది. అనంతరం పాల్ తమ కుటుంబ సభ్యులకు, బంధువులకు ఫోన్ చేసి అర్చనను చంపానని తానూ ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పి ఇంటిలోని ఫ్యానుకు ఉరివేసుకుని మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పాల్, అర్చన మృతితో ఇద్దరు ఆడపిల్లలు అనాథలయ్యారు. వీరిలో ఒకరు తొమ్మిదో తరగతి, మరొకరు ఏడో తరగతి చదువుతున్నారు.

క్లుప్తంగా

విశ్వబ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలని వినతి



నెహ్రూనగర్: విశ్వబ్రాహ్మణుల ప్రధాన సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు విన్నవించారు. తాడేపల్లిలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో కలసి బుధవారం వినతిపత్రం చేశారు. తొలుత విశ్వకర్మ భగవాన్ జయంతి వేడుకలు ప్రభుత్వ అధికారికంగా నిర్వహించటంపై కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పావులూరి మాట్లాడుతూ ప్రధానంగా రాష్ట్రవ్యాప్తంగా పంచవృత్తులు చేసే విశ్వబ్రాహ్మణులు కోరిక, వృత్తి కళాకారుల కోటాలో పెన్షన్ ప్రభుత్వ పరంగా అందించాలని కోరారు. రాష్ట్రంలో సుమారు 5 లక్షల మందికిపైగా స్వర్ణకారులు ఉన్నా నేపథ్యంలో మంగళ సూత్రం తయారు హక్కుదారులుగా విశ్వబ్రాహ్మణ స్వర్ణకారులకు వీలు కల్పించాలని వినతిపత్రంలో కోరారు. ఈ సందర్భంగా పలు ప్రధాన సమస్యలను సజ్జల రామకృష్ణారెడ్డి దృష్టికి తీసుకొచ్చారు.

జిల్లాలో అక్రమార్కులపై 81 కేసులు నమోదు

అక్రమ రేషన్ బియ్యమంటూ వచ్చిన కథనంపై ఖండన

నరసరావుపేట: జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు రేషన్ సరుకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడుతున్న వారిపై 81 కేసులు నమోదు చేసి చర్యలు తీసుకున్నట్లు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఎస్.పద్మశ్రీ పేర్కొన్నారు. బుధవారం ఒక దినపత్రికలో (సాక్షి కాదు) అక్రమ రేషన్ బియ్యం వ్యాపారులపై చర్యలేవి ? అంటూ ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆమె వివరణ ఇచ్చారు. పంపిణీలో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు, రైస్ మిల్లర్లు, నల్లబజార్లకు తరలించే వ్యక్తులపై 6ఏ కేసులు నమోదు చేసి, వారి వద్ద నుంచి 2646 క్వింటాళ్ల బియ్యం సీజ్ చేశామని వెల్లడించారు. పౌరసరఫరాలు, రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు నిత్యం సరుకుల పంపిణీలో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ అక్రమాల్ని అరికడుతున్నట్లు ఆమె పేర్కొన్నారు.

ఆంధ్రాకు జగనన్నే అవసరం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, హాజరైన ప్రజలు

- ఆ.. తీర్పు త్వరలోనే వస్తుంది
- ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారు
- ప్రజలు ఇప్పటికే నిర్ణయించుకున్నారు
- సన్నాహక సదస్సులో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తెనాలి: దేశంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అన్నింటినీ నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని రాబోయే ఎన్నికల్లో 175 సీట్లలో గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ఆంధ్రాకు జగనే సీఎం కావాలి అనే తీర్పు త్వరలోనే రానుందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. 'ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి' అనే కార్యక్రమ సన్నాహక సమావేశాన్ని మంగళవారం సాయంత్రం స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఏర్పాటుచేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ అధ్యక్షత వహించారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, పార్టీ ముఖ్యనేతల నుద్దేశించి ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడారు. రాష్ట్రంలో అవినీతి రహితమైన సంక్షేమ పాలన అందించిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి దక్కుతుందన్నారు. పేదవారిపై ప్రేమతో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా రూ.2.80 లక్షల కోట్లను పేదల ఖాతాల్లో జమచేసిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డివైపే రాష్ట్ర ప్రజలు ఉన్నారని చెప్పారు. తెనాలి నియోజకవర్గంలో ప్రజలకు రూ.1800 కోట్ల సంక్షేమ లబ్ధిని కలిగించే అవకాశం కల్పించిన సీఎం జగన్‌కు రుణపడి ఉంటానని ఎమ్మెల్యే శివకుమార్ అన్నారు. డ్వాక్రా మహిళలకు రుణాలను మాఫీ చేస్తానని చెప్పిన చంద్రబాబు తన హామీని నిలబెట్టుకోలేదని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీకి కట్టుబడి మూడు విడతలుగా రూ.19 వేల కోట్లను డ్వాక్రా మహిళల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందన్నారు. చివరి విడత రూ.6,250 కోట్లను వచ్చే జనవరిలో ప్రభుత్వం ఇవ్వనుందని చెప్పారు. వైఎస్సార్ చేయూత, అమ్మ ఒడి పథకాలతోపాటు నాడు నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలల్ని కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దినట్టు గుర్తుచేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెనలతో రాష్ట్ర పాలనలో పెనుమార్పులు తీసుకొచ్చారని చెప్పారు. అవ్వాతాతలకు పింఛన్లు గత ప్రభుత్వంలో తెనాలి నియోజకవర్గంలో 21 వేల మందికి నెలనెలా రూ. కోట్లను ఇవ్వగా, ఇప్పుడు 37 వేల మందికి రూ.10 కోట్లను ప్రతినెల ఇంటికి తీసుకెళ్లి వలంటీర్లు ఇస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో నివసించే పేద మధ్యతరగతి వర్గాలకు, అగ్రవర్ణాల పేదలకు పట్టణాల్లో 86 శాతం, గ్రామాల్లో 92 శాతం సంక్షేమం అందించామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ మాట్లాడుతూ పేదలకోసం నిరంతరం పాటుపడుతున్న వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మరో పదికాలాలపాటు సీఎంగా చేసుకుందామని పేదలు భావిస్తున్నారని, ప్రతిపక్షాల్లోని వారు కూడా మనసులో అదే కోరుకుంటున్నారని అన్నారు. పట్టణ జేసీఎస్ కన్వీనర్లు తాడిబోయిన రామయ్య, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, పట్టణ అధ్యక్షుడు మద్దాలి శేషాచలం, షేక్ దుబాయ్‌బాబు, కౌన్సిలర్లు కె.యశోద కపూర్, జి.మానసరెడ్డి, మొగల్ అహ్మద్, రాష్ట్ర జలవనరుల కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్ మాట్లాడారు. మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

వీర జవాన్ గోపరాజుకు ఘన నివాళులు

పల్లెకోన(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పల్లెకోనలో బుధవారం జవాన్ పురమా గోపరాజు (26)కు ఘన నివాళులర్పించారు. రాజస్థాన్‌లోని జస్సల్‌మీర్ వద్ద పాకిస్థాన్ బోర్డర్‌లో విధి నిర్వహణలో భాగంగా గోపరాజు ఈ నెల 24న గుండెపోటుతో మృతి చెందిన సంగతి తెలిసిందే. స్వగ్రామంలో బుధవారం నిర్వహించిన పెదకర్మలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. మంచి భవిష్యత్తు ఉన్న జవాను అకస్మాత్తుగా మరణించడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. గోపరాజు కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు నాంచారయ్య- మంగమ్మలను పరామర్శించి ఓదార్చారు.

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

కలెక్టర్ వేణుగోపాల రెడ్డి




జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం వద్ద రోగితో మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల రెడ్డి

పెదనందిపాడు: ప్రజలందరికి మంచి ఆరోగ్యాన్ని అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి చెప్పారు. మండల పరిధిలోని పాలపర్రులోని శ్రీ నరసింహ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని బుధవారం పరిశీలించారు. వైద్య సేవలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. మీకు ఇంకా ఏమైనా అవసరమైన సేవలు ఉన్నాయా, ప్రభుత్వం నుండి ఎటువంటి వైద్య సేవలు కోరుకుంటున్నారా అంటూ ప్రజలకు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వేణుగోపాల రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో క్లినిక్స్ ఏర్పాటు చేశామని, ప్రజా ఆరోగ్యం పేద ప్రజలకు చేరువ చేయాలనే సంకల్పంతో సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించడం జరిగిందని చెప్పారు. గతంలో ఏదైనా వైద్య పరీక్షలు చేయించుకోవాలంటే ల్యాబ్ ఎక్కడ ఉంటే అక్కడకు వెళ్లడంతో పాటు పరీక్ష చేయించుకున్న తర్వాత ఫీజు చెల్లించాల్సి ఉండేదని చెప్పారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత వైద్య సిబ్బంది మీ ఇంటికి వచ్చి వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తున్నారని, మీకు అవసరమైన స్పెషలిస్టు డాక్టర్లకు సిఫారుసు చేస్తున్నారని, పీహెచ్‌సీల్లో వైద్యులు అందుబాటులో ఉన్నారని, కంటి డాక్టర్లు కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు, వారికి కళ్లజోళ్లు కూడా ఉచితంగా అందిస్తున్నారని వివరించారు. వలంటీర్, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు కలిసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మీద ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామని, ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ప్రతి ఒక్కరికి వైద్యం అందించలన్నేదే ముఖ్యమంత్రి లక్ష్యం అని చెప్పారు. గ్రామంలో నీటి సరఫరా బాగా లేదని, నీరు సరిగా ఫిల్టర్ కావడం లేదని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. పాఠశాల ఆవరణ చుట్టూ ప్రహరీ నిర్మించాలని కలెక్టర్‌కు పాఠశాల సిబ్బంది వినతి పత్రం అందజేశారు. అనంతరం అర్హులకు కళ్లజోళ్లు, పీఎంజేఏవై కార్డులను పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో 357 మందికి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ ఎ.శ్రావణ్ బాబు, వైద్యాధికారి విజయ రత్నశేఖర్, సర్పంచి ఎ.సునీత, ఉపసర్పంచి జంపని సంజీవరావు, వైస్ ఎంపీపీ కె.సాంబశివరావు, ప్రత్తిపాడు మార్కెట్ యార్డు డైరెక్టర్ షేక్ ఖాశింపీరా, తహసీల్దార్ సుభాని, ఎంపీడీఓ రాజగోపాల్, ఈఓపీఆర్డీ సాయిలీల, పీఎస్ శ్రీనివాస్, వీఆర్ఓ కోటేశ్వరరావు, సీడీపీఓ సుజాతదేవి పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

గుంటూరు వెస్ట్: ప్రజల ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను అధికారులు సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల రెడ్డి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి బుధవారం అధికారులతో నిర్వహించిన వీడియో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వైద్య శిబిరాలు ముగిసే వరకు అధికారులు బాధ్యతగా ఏర్పాట్లను పర్యవేక్షించాలన్నారు. వైద్య శిబిరాల వద్దకు వచ్చే ప్రజలకు రిజిస్ట్రేషన్, డాక్టర్ కన్సల్టేషన్, మందులు, వైద్య పరీక్షలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. పాఠశాలల్లో డ్రాప్ అవుట్స్ లేకుండా చూడాలని చెప్పారు. 18 ఏళ్ళ లోపు వారిని విద్యా సంస్థల్లో చేర్పించాలన్నారు. ప్రతి మండలంలోనూ నూరు శాతం జీఈఈఆర్ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ, జిల్లా వైద్య అధికారి డాక్టర్ ఏ శ్రావణ్ బాబు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ కె.స్వాతి, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్ పాల్గొన్నారు.

సుధీర్‌ను పరామర్శించిన ఎమ్మెల్సీ రఘురాం



రామారావు (ఫైల్)

పెదనందిపాడు: కల్లూరి రామారావు కుటుంబ సభ్యులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కార్యక్రమాల సమన్వయకర్త, ఎమ్మెల్సీ తలశిల రఘురాం బుధవారం పరామర్శించారు. తలశిల టీమ్ సభ్యుడు సుధీర్ తండ్రి రామారావు(70) బుధవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. భౌతిక కాయాన్ని ఎమ్మెల్సీ రఘురాం సందర్శించి నివాళులర్పించారు. సుధీర్‌ని పరామర్శించారు.

రేపటి నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

గుంటూరు వెస్ట్(క్రీడలు): ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17 బాల బాలికల క్రీడా పోటీలు శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు నిర్వహణా కార్యదర్శి జి.ప్రతాప్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చేబ్రోలు మండలం వేజండ్లలోని జెడ్పీ హైస్కూల్‌లో అండర్-17 బాల బాలికల వాలీబాల్, బాల్ క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 7న చిలకలూరిపేట ఏఎంజీ స్కూల్‌లో బాల బాలికల బాక్సింగ్, బాలుర బాస్కెట్ బాల్ పోటీలు, ఉప్పలపాడులోని జెడ్పీహెస్‌లో బాలికల ఫుట్‌బాల్ పోటీలు, తాడేపల్లిలోని ప్రో షట్లర్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో బాల బాలికల షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు, గుంటూరులోని అమరావతి రోడ్డులోని ఇండియన్ రైఫిల్ షూటింగ్ అకాడమీలో బాల బాలికల రైఫిల్ షూటింగ్ ఎంపిక నిర్వహిస్తామన్నారు. ఈ నెల 9న ఏఎంజీ స్కూల్ చిలకలూరిపేటలో అండర్-14, 17 బాల బాలికల జూడో, నెట్‌బాల్ పోటీలు, గుంటూరు హిందూ స్కూల్‌లో బాల బాలికల చెస్ పోటీలు, జెడ్పీహెచ్‌లో పొన్నెకల్లులో బాల బాలికల టేబుల్ టెన్నిస్ పోటీలు, జెడ్పీహెచ్ఎస్ కొమెరేపూడిలో యోగా పోటీలు ఏర్పాటు చేశామన్నారు. 10వ తేదీన జెడ్పీహెచ్ఎస్ చినకాకానిలో అండర్-14 బాలబాలికల కబడ్డీ పోటీలు, ఎస్ఎస్ఆర్ఆర్ జెడ్పీహెచ్ఎస్ చిరుమామిళ్లలో అండర్-17 బాల బాలికల షూటింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 11న నరసరావుపేటలోని మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్లో అండర్-14 బాలికల బాస్కెట్ బాల్ పోటీలు, జెడ్పీహెచ్ఎస్ పొనుగుపాడులో బాల బాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు, గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్డులోని శుభం క్రికెట్ అకాడమీలో అండర్-14 బాలుర క్రికెట్ పోటీలు, తెనాలి ఏఎస్ఎన్ స్టేడియంలో బాల బాలికల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 12న నిడమర్రు జెడ్పీహెచ్ఎస్‌లో అండర్-14, 17 బాల బాలికల ఖో-ఖో పోటీలు, గుంటూరు బీఆర్ స్టేడియంలో బాల బాలికల తైక్వాండో పోటీలు, జెడ్పీహెచ్ఎస్ కొమెరేపూడిలో అండర్-14, 17 బాల బాలికల ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

మరో 148 మొబైల్‌ఫోన్లు అప్పగింత



అప్పగించిన మొబైల్‌ఫోన్లతో బాధితులు, చిత్రంలో జిల్లా ఏఎస్పీ కె.సుప్రజ

నగరంపాలెం: మొబైల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు తిరిగి సెల్‌ఫోన్లను అప్పగించే ప్రక్రియను గుంటూరు సైబర్ క్రైం పోలీసులు కొనసాగిస్తున్నారు. మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న 148 మంది బాధితులకు రూ.30.50 లక్షలు ఖరీదు చేసే ఫోన్లను బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయ(డీపీఓ) ఆవరణలో జిల్లా ఐటీ కోర్ నోడల్ అధికారిణి, జిల్లా ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ అందజేశారు. ఆమె మాట్లాడుతూ మొబైల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితుల సౌకర్యార్థం ఈ ఏడాది మొదట్లో జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్ నేతృత్వంలో వాట్సాప్ నంబర్ 8688831574 అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. వాట్సాప్ నంబర్ ఆధారంగా ఎటువంటి ఎఫ్ఐఆర్ లేకుండా బాధితులకు సెల్‌ఫోన్లను అందిస్తున్నామని అన్నారు. ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు ఎవరైనా ఉన్నట్‌లెత్తై వెంటనే సీఈఐఆర్ సిటిజన్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. తమిళనాడు మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, తెలంగాణ రాష్ట్రాల నుంచి అధిక ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఐటీ కోర్ ఎస్ఐ శ్రీనాథ్, ఏఎస్ఐ రాందాస్‌రెడ్డి, సిబ్బంది కరిముల్లా, రమేష్ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కిషోర్ ఆత్మహత్య



ఫిరంగిపురం: పురుగుమందు తాగి కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రంలోని వసంతనగర్‌కు చెందిన ఎం.కిషోర్(40) ఉదయం తమ ఇంటిపైన వ్యాయామం చేసుకుంటానికి వెళ్లాడు. ఇద్దరు పిల్లలను పాఠశాలలో వదిలి పెట్టాలని భార్య ఇంటిపైకి వెళ్లి చెప్పడంతో వారించి కిందకి పంపించి వేశాడు. కొద్దిసేపటి తరువాత తాగునీరు కావాలంటూ కేకలు వేయడంతో భార్య డాబాపైకి వెళ్లి చూడడంతో అప్పటికే కిషోర్ అపస్మారక స్థితిలోకి వెళ్లడం గమనించి ఆమె బంధువుల సహాయంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు చికిత్సకోసం తరలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చల్లా కిషోర్ తెలిపారు. మృతుడు గుంటూరులోని కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు.

ఉత్కంఠగా కృష్ణా- ప్రకాశం జిల్లా టెస్ట్ మ్యాచ్



ఆరు వికెట్లు తీసిన బౌలర్ చిన్నా

నరసరావుపేట: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న సెంట్రల్ జోన్ అంతర్ జిల్లాల మూడు రోజుల బాలుర టెస్ట్ క్రికెట్ మ్యాచ్‌లు ఉత్సాహభరితంగా సాగుతున్నాయి. కృష్ణా, ప్రకాశం జిల్లా జట్లు మధ్య మ్యాచ్‌లో నిన్నటి ఓవర్ నైట్ వికెట్ నష్టానికి 12 పరుగులతో బుధవారం బ్యాటింగ్ ప్రారంభించిన కృష్ణా జిల్లా జట్టు 47.4 ఓవర్లలో 181 పరుగులకు ఆలౌట్ అయింది. కృష్ణా జిల్లా జట్టులోని వరుణ్ సాత్విక్ 75 పరుగులు చేయగా ప్రకాశం జిల్లా జట్టులోని సుమిత్ర, నవీన్‌లకు చెరో మూడు వికెట్లు లభించాయి. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ప్రకాశం జిల్లా జట్టు ఆట ముగిసే సమయానికి తొమ్మిది వికెట్లు కోల్పోయి 187 పరుగులు చేసింది. ప్రకాశం జిల్లా జట్టులోని చిన్నారావు 50 పరుగులు చేయగా కృష్ణా జిల్లా జట్టులోని చిన్నా ఆరు వికెట్లు సాధించాడు. రేపు మూడో రోజు ఆట కొనసాగుతుందని గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీతాపతిరావు తెలిపారు.

సమగ్రశిక్షలో పోస్టులకు సర్టిఫికెట్ల పరిశీలన

గుంటూరు ఎడ్యుకేషన్: సమగ్రశిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు బోధనకు సంబంధించి, కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయనున్న పోస్టులకు అర్హులైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన బుధవారం నిర్వహించారు. పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్ష భవన్‌లో ఆయా పోస్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు నిర్వహించిన సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను సమగ్రశిక్ష ఏపీసీ జి.విజయలక్ష్మి పర్యవేక్షించారు. ఆమె మాట్లాడుతూ హియరింగ్, విజువల్లీ ఇంపేర్డ్, ఎంఆర్ కేటగిరీ పోస్టులకు సంబంధించి ఆన్‌లైన్‌లో 144 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. వీటిలో హెచ్ఐ, వీఐ కేటగిరీల వారీగా 63, ఎంఆర్ కేటగిరీ కింద 81 ఉండగా, రెండు రోజుల వ్యవధిలో 99 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసినట్లు వివరించారు. మిగిలిన అభ్యర్థులు గురువారం సాయంత్రం లోపు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాలని సూచించారు. సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకున్న అభ్యర్థులకు జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో నియామకాలు చేపడతారని తెలిపారు.

మెరుగైన విద్యుత్ సరఫరా ప్రభుత్వ లక్ష్యం

మంత్రి మేరుగ నాగార్జున



సబ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి మేరుగ

పెరవలి(వేమూరు): వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం నూతన విద్యుత్ సబ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. వేమూరు మండలంలోని పెరవలిలో రూ. 4.5 కోట్లతో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెరవలిలో ఏర్పాటు చేసిన సబ్‌స్టేషను వల్ల పెరవలిపాలెం, పెరవలి, చావలి, కోడిపర్రు, పెనుమర్రు గ్రామాలకు మెరుగైన విద్యుత్ సరఫరా లభిస్తుందన్నారు. వినియోగదారులకు 24 గంటలు విద్యుత్ సరఫరా చేసేందుకు నూతనంగా సబ్ స్టేషన్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. భట్టిప్రోలు మండలంలోని వెల్లటూరు, అమృతలూరు మండలంలోని ఇంటూరు, చుండూరు మండలంలోని పెదగాదెలవర్రుల్లో నూతనంగా సబ్ స్టేషన్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాల ద్వారా ఇప్పటిదాకా పెరవలికి రూ. 30,62,40,387 లబ్ధి చేకూరిందని ఆయన వెల్లడించారు. ప్రజల్ని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు, అవినీతి లేకుండా సంక్షేమ పథకాలు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా విద్యుత్‌శాఖ అధికారి మురళీకృష్ణ, డీఈ చిరంజీవి, గ్రామ సర్పంచ్ దాది వెంకట లక్ష్మీరాజ్యం, జె.రూబేను, రాపర్ల నరేంద్ర, జెడ్పీటీసీ సభ్యురాలు గాజుల హేమలత పాల్గొన్నారు.